క్లుప్తంగా

నేడు కుమురంభీమ్ విగ్రహావిష్కరణ

పాల్వంచరూరల్: మండల పరిధి పాతసూరారంలో ఏర్పాటు చేసిన కుమురంభీమ్ విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ అధికారుల పొలంబాట


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సుజాతనగర్: విద్యుత్ అధికారులు శుక్రవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. సింగభూపాలెం గ్రామంలోని పంట పొలాల్లో అధికారులు పర్యటించారు. వ్యవసాయ బోర్లకు కెపాసిటర్లు అమర్చడం వలన కలిగే ప్రయోజనాలను విద్యుత్ శాఖ డీఈ రంగస్వామి వివరించారు. కెపాసిటర్లు అమర్చడం వలన నీరు మోటారు నుంచి ఎక్కువ స్పీడ్‌తో వస్తుందన్నారు. పొలాల్లో ఇనుపపెట్టెల స్థానంలో ప్లాస్టిక్ బాక్సులు అమర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఈ రవికుమార్, ఏఈ కిషన్, రైతులు పాల్గొన్నారు.

చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా పాటల పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: ఆగస్టు 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ముందస్తుగా శుక్రవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో చిరంజీవి యూత్ ఆధ్వర్యంలో పాటలపోటీలను నిర్వహించారు. పోటీలను కంచర్ల చంద్రశేఖర్, సీఐ కరుణాకర్, డాక్టర్ నాగరాజు, న్యాయవాది కామేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిరంజీవి పుట్టినరోజుకు ముందస్తుగా ఈ పోటీలను అఖిల భారత చిరంజీవి యువత రవణం స్వామినాయుడు ఆర్గనైజర్‌గా, కొత్తగూడెంలో చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ చీఫ్ ఆర్గనైజర్ బీవీ విల్సన్‌బాబు ఆధ్వర్యంలో క్వార్టర్ ఫైనల్ విభాగంలో పాటలపోటీలు నిర్వహించడం అభినందించదగిన విషయమన్నారు. ప్రథమస్థానం విజేత ఖమ్మానికి చెందిన కీర్తన, ద్వితీయ బహుమతి కొత్తగూడేనికి చెందిన లక్ష్మీప్రసన్న, తృతీయ బహుమతి భద్రాచలానికి చెందిన పోకల శ్రీనివాస్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దెల శివకుమార్, మల్లేష్ యాదవ్, మతిన్, శ్రీనివాస్, సందీప్, అజయ్, నర్సింహారావు, దుర్గారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ..


లీకవుతున్న మిషన్ భగీరథ పైపులైన్

టేకులపల్లి: టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ లచ్చాతండా, సింగ్యాతండాల్లో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ వల్ల తాగునీరు వృథా అవుతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కొద్దిరోజులుగా లచ్చాతండాలో, సింగ్యాతండాలోని ట్యాంకు వద్ద లీకేజీ కారణంగా నీరు రోడ్డుపై పారుతుండటంతో స్థానికుల రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. అధికారులకు పదేపదే చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీటి వృథాను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నాళ్లు, ఎన్నేళ్లు ఈ కష్టాలు?


వాగు నుంచి బుర్రలు, బిందెల్లో నీళ్లు తెచ్చుకుంటున్న ఆదివాసీలు (ఫైల్)

సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతోంది.. అన్నివర్గాల ప్రజలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నారు. కానీ ఆచార వ్యవహారాలను పదిలపర్చుకుంటూ అడవులు, కొండకోనల నడుమ జీవనం సాగించే ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నారు. అభివృద్ధి కోసం నెలకొల్పిన ఐటీడీఏ ద్వారా కొంత మేర ఫలితాలు వచ్చినా నూరు శాతం సమగ్రాభివృద్ధి జరగలేదనే చెప్పాలి. ప్రభుత్వాలు మారుతున్నా మార్పు లేకపోవడంతో ఆదివాసీలకు ఇక్కట్లు తప్పడం లేదు.

- అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గిరిజనులు
- విద్యుత్, రహదారి, తాగునీటి సౌకర్యాలు కరువు

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

పాల్వంచరూరల్: ఆదివాసీ, గిరిజనుల ఆచారాలు, కట్టుబాట్లు, జీవనశైలి విభిన్నంగా ఉంటుంది. అడవినే నమ్ముకుని జంతువుల మధ్య జీవనం సాగిస్తుండగా నివాసాలకు రహదారి లేకపోగా విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు అల్లంత దూరంగానే ఉన్నాయి. ఏళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన ఆదివాసీల సమస్యలను పట్టించుకునే వారు లేక వారి ఆవేదన అరణ్యరోదనగానే మిగిలిపోతోంది. జిల్లాలో 74 ఆదివాసీ గుంపులు(గూడేలు) అందులో 2.94లక్షలకు పైగా గిరిజనులు ఉన్నట్లు అంచనా. ఇందులో సుమారు 20వేల మంది ఆదివాసీలు ఉంటారు. పాల్వంచ మండలంలో పది ఆదివాసీ గూడేలు ఉన్నాయి. కాగా, ఇక్కడి ప్రజలు వ్యవసాయం, అటవీ ఫలసాయయే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు.


అస్వస్థతకు గురైన మహిళను జెట్టిలో ఆస్పత్రికి తీసుకెళ్తున్న సీతారాంపురం ఆదివాసీలు (ఫైల్)

అన్నీ దూరమే.. ఆదివాసీ గిరిజనుల పిల్లలకు విద్య అందక పోగా, వీరి గ్రామాలకు రహదారులు కూడా లేవు. ఫలితంగా రవాణా సౌకర్యం అందక ఎటైనా సరే కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సిందే. వర్షాకాలంలో ఈ కారణంగా సమస్య ఎదురవుతుండగా.. అనారోగ్యం బారిన పడితే చికిత్స అందే వరకు ప్రాణాలు దక్కుతాయో, లేదోనన్న నమ్మకం ఉండడం లేదు. ఇక కొన్ని ఆదివాసీ గూడేలకు మిషన్ భగీరథ పైపులైన్ వేసి తాగునీరు అందిస్తుండగా ఇంకొన్ని గ్రామాలవారు వాగులు, చెలిమలు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.

పట్టించుకోని ఐటీడీఏ

ఇల్లెందు: ఆదివాసీ పల్లెలకు ప్రభుత్వం, ఐటీడీఏ నిధులు కేటాయించటం లేదు. ఫలితంగా గిరిజనులకు రహదారి సమస్య, గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైన్లు, సాగునీరు అందడం లేదు. అంతేకాక గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలు సైతం సమస్యలతో సతమతం అవుతున్నాయి. ఇల్లెందు బాలుర బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కనీసం డైనింగ్ హాల్ లేదు. వర్షాకాలంలో తడుస్తూ భోజనం చేస్తున్న పరిస్థితి. ప్రత్యేకంగా తరగతి గదులు, నివాస గదులు లేవు. భోజనం చేసిన చోటే తరగతులు. ఇలా ఆదివాసీ పల్లెలు నిరాదరణకు గురవుతున్నా యి. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి పెట్టి విద్య, వైద్యంతో పాటు వ్యవసాయం అభివృద్ధి చేయాలని గిరిజన నాయకులు కోరుతున్నారు.


డైనింగ్ హాల్ లేని రొంపేడు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల

పేరు గొప్ప ఊరు దిబ్బ...



దశాబ్దాలుగా కనీస సౌకర్యాల కోసం ఉద్యమిస్తున్నా ఫలితం దక్కడం లేదు. చట్టాలు అమలుకాక నాయకుల మొసలి కన్నీటితో పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా ఉంది. వనరుల దోపిడీతో గిరిజనులకు నష్టం జరుగుతోంది. సమస్యలపై ఉద్యమానికి ప్రణాళిక రూపొందిస్తున్నాం. – చందా లింగయ్య, ఆదివాసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు

అధికారికంగా నిర్వహించాలి..



ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి. పాలకులు ఆదివాసీ దినోత్సవాన్ని ఆశగా చూపి హక్కులను కాలరాస్తున్నారు. ఆదివాసీల కోసం అనేక చట్టాలు ఉన్నా అవి అమలుకు నోచుకోవడం లేదు. వీరి గూడేలకు తాగునీరు, రహదారి, విద్యుత్ సౌకర్యం లేక అవస్థ పడుతున్నారు. – గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవు..



ఏజెన్సీలో ఆదివాసీలకు ప్రభుత్వపరంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కడం లేదు. విద్యా సంస్థల్లో సరిపడా సీట్లు లభించక ప్రైవేట్‌లో చదవలేక విద్యకు దూరమవుతున్నారు. ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు కూడా ఆదివాసీలు పొందలేకపోతున్నారు. అయినా ప్రభుత్వం, ఐటీడీఏ పట్టించుకోవడం లేదు. – త్రినాథ్‌రావు, హైకోర్టు న్యాయవాది

రాఖీ సందడి


కొత్తగూడెంఅర్బన్: శ్రీరాగాలో పాఠశాలలో...

శ్రీ రాగా ప్లే హైస్కూల్‌లో...

కొత్తగూడెంఅర్బన్: మేదరబస్తీలోని శ్రీ రాగా ప్లే హైస్కూల్‌లో వరలక్ష్మీ వ్రతం, రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ వరప్రసాద్, డైరెక్టర్ కవిత, ఉపాధ్యాయులు అమ్మవారికి పూజలు చేసి వాయినాలు ఇచ్చుకున్నారు. విద్యార్థులు రాఖీలు కట్టారు. రెండు పండుగలతో స్కూల్ సందడి వాతావరణం నెలకొంది.

సుజాతనగర్: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ సందడి మండలంలో నెలకొంది. పండుగ నేపథ్యంలో మండల కేంద్రంలో పలుచోట్ల రాఖీ దుకాణాలను ఏర్పాటు చేశారు. వివిధ డిజైన్లలో రూ.15 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు. చిన్నారులు మెచ్చేలా కార్టూన్ పాత్రలతో కూడిన రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

జూలూరుపాడు: రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు శనివారం ఘనంగా జరుపుకోనున్నారు. శ్రావణ పూర్ణిమను రక్షాబంధనం పర్వదినంగా జరుపుకోవడం ఆనాయితీగా వస్తున్న సంప్రదాయ వేడుక. రాఖీ పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రం జూలూరుపాడు ప్రధాన రహదారికి ఇరువైపుల వ్యాపారులు ప్రత్యేకంగా రాఖీ దుకాణాలు ఏర్పాటు చేశారు. దుకాణాల వద్ద మహిళలు, యువతులు, చిన్నారులు రాఖీల కొనుగోళ్లు, మిఠాయి దుకాణాల్లో సందడి నెలకొంది.

పేదల కల నెరవేరుస్తాం..

జూలూరుపాడు: ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ అన్నారు. శుక్రవారం శంభునిగూడెం, గాంధీనగర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, మాలోత్ నరేష్, మల్కం వీరభద్రం, ఈసం వెంటేశ్వర్లు, తాటి అరుణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గణేష్ మండపం ఏర్పాటుకు భూమిపూజ


పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని రైటర్ బస్తీ గొల్లగూడెం ఏరియా త్రిమాత ఆలయ సమీపంలో డబ్ల్యూబీజీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల మండపానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా గణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బదిలీల మినహాయింపుపై హర్షం

టేకులపల్లి: దివ్యాంగ ఉద్యోగులకు బదిలీలపై మినహాయింపు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం జీఓ నంబర్ 34 విడుదల చేయడం హర్షణీయమని తెలంగాణ దివ్యాంగ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. వికలాంగ ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై సాధారణ బదిలీలకు లోబడవలసిన అవసరం లేదని 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ శాతం వికలాంగత ఉన్న ఉద్యోగులు ప్రస్తుత పోస్టులో కొనసాగవచ్చని పేర్కొన్నారు. మానసిక వికలాంగత కలిగిన పిల్లల తల్లిదండ్రులుగా ఉన్న ఉద్యోగులు వారి అభిరుచికి అనుగుణంగా అదే పోస్టులో కొనసాగే అవకాశం ఉందని పేర్కొన్నారు. 70 శాతం కంటే ఎక్కువ శాతం వికలాంగత ఉన్న కుటుంబ సభ్యులను చూసుకునే ఉద్యోగులు (తల్లిదండ్రులు/పిల్లలు/జీవిత భాగస్వామి/సోదరులు/సోదరీమణులు) మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఈ జీఓ వల్ల దివ్యాంగులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని జీఓ విడుదల చేసినందుకు ప్రభుత్వానికి, సంబంధిత శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్‌రావు, చైర్మన్ వీరయ్య వర్మ, దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై పని చేసిన రాష్ట్ర సంఘం బాధ్యులు హబీబ్ మియా, లక్ష్మయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ప్రభుత్వం వికలాంగుల హక్కులచట్టం–2016 ప్రకారం వికలాంగ ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వడం హర్షణీయమని దివ్యాంగ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోత్ జగ్గదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబరు 34 ఈనెల 7వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు.

కోలిండియా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించండి..


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో ఏరియా ఏర్పాటైన నాటి నుంచి కోలిండియా స్థాయి కబడ్డీ పోటీలు ఎప్పుడూ నిర్వహించలేదని, ఈసారి కొత్త కార్పొరేట్‌కు వచ్చిందని, ఈ నేపథ్యంలో ఈ క్రీడలు కొత్తగూడెం ఏరియాలో నిర్వహించాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజుకు ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రజాక్ మాట్లాడుతూ... త్వరలో సింగరేణిలో క్రీడల పండుగ రానుందని, సంస్థ ఉన్నతాధికారులను సంప్రదించి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసి ఏరియా కీర్తిని కోలిండియా స్థాయిలో ఇనుమడింపజేయాలని కోరారు. అంతేకాకుండా కార్పొరేట్ ఏరియా కంటే, ఏరియా కార్మికులు అత్యధికంగా కోలిండియా పోటీలలో పాల్గొని, మెడల్స్ తెచ్చిన కీర్తి ఏరియాకు ఉందని, అంతే కాకుండా ఇక్కడి గ్రౌండ్‌లలో ప్రాక్టీస్ చేసిన వారు కేంద్ర, రాష్ట్ర పోలీసు, ఆర్మీ, వంటి యూనిఫామ్ ఉద్యోగాలు పొందినవారు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన జీఎం ఈ విషయంపై ఉన్నతాధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

ధార్మికతతోనే సమాజ సంస్కరణ సాధ్యం

కొత్తగూడెంఅర్బన్: భౌతికవాద దృక్పథంతో సమాజంలో మానవతా విలువలు మంట కలిసిపోతున్నాయని జమాతే ఇస్లామి హింద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖాలిద్ ముబష్షీరుల్ జఫర్ అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం మధువన్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం ఎంతగా అభివృద్ధి చెందామో, చెడులు కూడా అంతే పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్య్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా 80 శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారని, దీనికి కారణం ప్రజాసేవ పేరుతో రాజకీయ నాయకులు ధనవంతులుగా, స్వార్థపరులుగా ఉండడమే కారణమన్నారు. జమాతే ఇస్లామి హింద్ కార్యకర్తలు సమాజ సంస్కరణ కోసం కృషి చేయాలని కోరారు. ముస్లింలు కులమతాలకు అతీతంగా చెడును పారదోలడమే నిజమైన దైవభక్తి అన్నారు. ప్రతీ రంగంలో ముఖ్యంగా పేదరికానికి దిగువ ఉన్నవారి అవసరాలు తీర్చే ప్రయత్నం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి ఫహీముద్దీన్, జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్‌ఖాన్, షరీఫ్, పట్టణ అధ్యక్షులు షారుఖ్ యజ్దానీ, జహంగీర్ షరీఫ్, రబ్బానీ, అబ్దుల్ బాసిత్, ఆబీద్, షేహనాజ్, సఫూరా, పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

11న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం


మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 11న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి ప్రభుదయాళ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు మాత్రలు ఇచ్చే ముందు పిల్లలు ఖాళీ కడుపుతో ఉండకుండా చూసుకోవాలని, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఈ మాత్రలు ఇవ్వకూడదని, పిల్లలు మాత్రలు వేసుకునే సందర్భంలో ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఆరోజు పాఠశాలకు రాని విద్యార్థులకు 18వ తేదీన మాత్రలు వేయించాలని తెలిపారు.

పాల్వంచరూరల్: ఈనెల 11న అంతర్జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 19 సంవత్సరాల వయస్సులోపు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. రెండేళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్ర సగం వేయాలని, 2 – 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర వేయాలన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల వద్ద మాత్రల పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఆరోజు ఎవరైనా మాత్రలు వేయని పక్షంలో వాళ్లను గుర్తించి 18వ తేదీన తిరిగి మాత్రలు వేయాలని సూచించారు.ఆ రోజున వందశాతం పూర్తిచేయాలన్నారు.ఈ సమావేశంలో తహసీల్దార్ దారా ప్రసాద్,మండల విద్యాశాఖాధికారి శ్రీరాంమూర్తి, సీడీపీఓ లక్ష్మీప్రసన్న,డాక్టర్ రాజు,ప్రతాప్,కృష్ణకుమారి,ప్రసాద్,నాగమణి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: ఆపరేషన్ సిందూర్ విజయం అనంతరం మొదటిసారి వచ్చే ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవాన్ని పెద్దఎత్తున జరుపుకోవాలని, ఆదేరోజు ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. బీజేపీ హర్ ఘర్ తిరంగా కార్యశాలలో భాగంగా శుక్రవారం స్థానిక నెహ్రూనగర్‌లోని మినీ ట్యాంక్ బండ్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11, 12వ తేదీల్లో మండల, జిల్లా కేంద్రాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. 13,14 తేదీలలో స్వాతంత్య్ర సంగ్రామం చారిత్రాత్మక ప్రదేశాలు, చిహ్నాలు, స్వాతంత్య్ర వీరుల విగ్రహాలు ఉన్న ప్రదేశాలలో స్వచ్ఛ భారత్, అమర సైనికుల, పోలీసుల కుటుంబాలకు సన్మానం, ఇంటింటికీ జాతీయ జెండాల పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జీవీకే మనోహర్, కేవీ రంగాకిరణ్, జల్లారపు శ్రీనివాస్, గొడుగు శ్రీధర్, రాపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఓట్ల తొలగింపుపై సీపీఎం నిరసన

సింగరేణి(కొత్తగూడెం): బీహార్‌లో ప్రతిపక్షాలు, మైనార్టీల ఓట్లను గల్లంతు చేసేందుకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఓటు సవరణ పేరుతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధానాన్ని తీసుకొచ్చిందని, దీని వలన అప్రజాస్వామికంగా ఓట్లు తొలగింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానానికి వ్యతిరేకంగా స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి ప్రదర్శనగా అమరవీరుల స్తూపం వద్ద ప్లకార్డులతో శుక్రవారం నిరసన తెలిపారు. మాట్లాడుతూ... బీహార్‌లో అధికారంలోకి వచ్చేందుకు తమకు వ్యతిరేకంగా ఓట్లు పడతాయని, ఇందులో భాగంగా ఆయా ఓట్లను తొలగించే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్వతంత్ర సంస్థగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక సమగ్ర సవరణ విధానం నేడు బీహార్, రేపు భారతదేశం అంతటా విస్తరిస్తుందని, దీనిని అన్నివర్గాల ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవరలక్ష్మీదేవి పూజలు

కొత్తగూడెంటౌన్: కోరిన కోరికలను తీర్చే అమ్మవారు వరలక్ష్మీదేవి అమ్మవారిని ఆడపడుచులు వరలక్ష్మీవ్రతం పండుగను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఇండ్లలోనూ. ఆలయాల్లోనూ పవిత్ర పూజలను చేశారు. ఇస్తినమ్మ వాయినం పుచ్చుకుంటినమ్మ వాయినం అంటూ పూజలు చేసి వాయినాలను సమర్పించుకున్నారు. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలతో పవిత్ర పూజలను చేశారు.


జూలూరుపాడు: శ్రీవరలక్ష్మీదేవీ వ్రత పూజలను మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లల్లో వరలక్ష్మీ అమ్మవారి చిత్రపటం, విగ్రహం వద్ద కలశం ఏర్పాటు చేసి, గంధం, పసుపు, కుంకుమలతో కలశాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పిండి వంటలు, క్షీరాన్నం, పండ్లు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఇరుగుపొరుగు మహిళలను పిలిచి వాయినాలు అందజేశారు.


ఇల్లెందు: ఇల్లెందులపాడులో...

ఇల్లెందు: పట్టణంలోని పలు దేవాలయాల్లో వరలక్ష్మీ ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఇళ్లను శుభ్రం చేసుకుని కొత్త వస్త్రాలు ధరించి ప్రత్యేక అలంకరణతో అమ్మవారిని పూజించారు.


ఇల్లెందురూరల్: మండలంలోని గ్రామాలలో వరలక్ష్మీవ్రతాలు, నోములు వైభవంగా జరిగాయి. శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మహిళలు ఇష్టదైవానికి ప్రత్యేక పూజ చేశారు. అష్టోత్తర శతనామాలతో అమ్మవారిని పూజించారు. బెల్లం, చక్కెర, నెయ్యిలతో తయారు చేసిన నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. అనంతరం తోటి మహిళలకు తమలపాకు, అరటిపండ్లు, నానబెట్టిన శనగలు, వక్కపొడి, బియ్యం పిండితో ప్రసాదాన్ని వాయినంగా ఇచ్చిపుచ్చుకున్నారు.

టేకులపల్లి: మండలంలోని గ్రామాలలో మహిళలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పూజలు జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లల్లో ప్రత్యేక పూజలు చేసి ముత్తయిదువలను పిలిచి వాయినాలు ఇచ్చారు.


టేకులపల్లిలో...,


జూలూరుపాడు: అమ్మవారిని అలంకరిస్తున్న యువతి


ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో...


కొత్తగూడెంటౌన్: గణేష్‌టెంపుల్‌లో..

డబ్బాపాలు వద్దు.. తల్లిపాలే ముద్దు


సింగరేణి(కొత్తగూడెం): మెయిన్ ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లలిత


కొత్తగూడెంఅర్బన్: వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ జయలక్ష్మి

సింగరేణి(కొత్తగూడెం): అమ్మపాలు అమృతంతో సమానం, పుట్టినబిడ్డకు తల్లిపాలు సంజీవనిగా పనిచేస్తాయని, కానీ నేడు చాలామంది తల్లులు డబ్బా పాలు పట్టిస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. డబ్బాపాలు వదు.. తల్లిపాలు ముద్దు అని సింగరేణి హెల్త్ ఆఫీసర్ లలిత పేర్కొన్నారు. శుక్రవారం సింగరేణి ప్రధానాస్పత్రిలోని చిల్డ్రన్ వార్డ్‌లో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలు బిడ్డను పలు వ్యాధుల నుంచి రక్షిస్తాయని చెప్పారు. ప్రపంచంలో తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేదని, తల్లిపాలు అత్యంత విశిష్టమైనవన్నారు. చంటిబిడ్డలు తల్లిపాలతో యాక్టివ్‌గా ఉంటారని పేర్కొన్నారు. దీంతోపాటు ఆటపాటల్లో తెలివితేటలు వృద్ధి చెందుతాయని చెప్పారు. తదుపరి పిల్లలకు పాలిచ్చే తల్లులకు పలు సూచనలు, ఆహార పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడిషినల్ సీఎంఓ ఉష, డీజీఓ డాక్టర్లు, నర్సులు, తల్లులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: పోషకాహార లోపం, రక్తహీనత కారణంగా శిశు మరణాలు జరుగుతున్నాయని, వాటిని అధిగమించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో శిశు మరణాలపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. పిల్లల మరణాలకు ప్రధాన కారణమైన రక్తహీనతను ఎదుర్కోవడానికి తల్లి, శిశు పోషకాహారాన్ని మెరుగుపరచాల్సిన అవసరాన్ని తెలియజేశారు. గర్భిణులకు పోషకాహార విలువలపై హెల్త్ వర్కర్స్ అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్లు ముక్కంటేశ్వరరావు, వి.వీరబాబు, సాగరిక, ప్రోగ్రాం ఆఫీసర్ యు.తేజశ్రీ, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.